ప్రజాశక్తి
బుధవారం 28 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం

పిఎల్ఐ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లుగా పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 380 మంది ఏజెంట్లను నియమించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. పాలసీలపై కమీషన్ ఆధారితంగా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోగా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, శ్రీకాకుళం డివిజన్ -532001 చిరునామాకు పంపించాలని సూచించారు.

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తుండడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ముందు వరకు వైసిపి అధికారంలో ఉండడం, జెడ్‌పి పాలకవర్గం ఆ పార్టీ చేతిలో ఉండడంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగింది. హిరమండలం జెడ్‌పిటిసి మినహా అన్ని జెడ్‌పిటిసి స్థానాలు, చైర్‌పర్సన్, డిప్యూటీ చైర్‌పర్సన్ వైసిపికి చెందిన వారే ఉన్నారు. జిల్లాలోని అన్ని ఎంపిపి స్థానాల్లోనూ ఆ పార్టీ వారే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. హిరమండలం జెడ్‌పిటిసి ఏదైనా సమస్యను లేవనెత్తితే నాటి స్పీకర్, మంత్రుల దగ్గర నుంచి స్థానిక ప్రజాప్రతినిధుల వరకు మూకుమ్మడిగా మాటల దాడి చేసిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర మంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు అంతా కూటమి ప్రభుత్వానికి చెందిన వారే ఉన్నారు. గతంలో మాదిరిగా కాకుండా సానుకూల వాతావరణంలో చర్చలు జరిగి సమస్యలు పరిష్కారం కావాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

రసవత్తర రాజకీయం

- అధికారంలో టిడిపి కూటమి ప్రభుత్వం
- వైసిపి చేతిలో పాలకవర్గం
- వాడివేడిగా చర్చలు సాగే అవకాశం
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జెడ్‌పి సర్వసభ్య సమావేశం చివరిసారిగా ఈ ఏడాది జూన్ ఒకటో తేదీన నిర్వహించారు. అప్పటికి ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో కేవలం జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు మాత్రమే హాజరయ్యారు. సమావేశం కూడా తూతూమంత్రంగానే సాగింది. ఇప్పుడు కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో సమావేశం రసవత్తరంగా మారనుంది. ప్రజా సమస్యలపై అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష వైసిపి సభ్యులూ ప్రశ్నించే అవకాశాలున్నాయి. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో ప్రధానంగా సాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. వంశధార కుడి, ఎడమ కాలువల్లో పూడిక, గుర్రపు డెక్క బాగా పేరుకుపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. టెక్కలి, పలాస ప్రాంతాల్లో అక్కడక్కడా పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తొలగించినా పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదు. ఆగస్టులో కొంత వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో లక్ష్యం మేర వరి సాగు జరగని పరిస్థితి నెలకొంది.

షట్టర్ల సమస్యకు పరిష్కారం దొరికేనా?

వంశధార కాలువలపై ఏర్పాటు చేసిన సాగునీటి కాలువలు ఎక్కడిక్కడ శిథిలమయ్యాయి. నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లపై అవినీతి కేసు 15 ఏళ్ల గడుస్తున్నా కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి, జలుమూరు ప్రాంతాల్లో గొడౌన్లలో సుమారు రూ.ఐదు కోట్ల విలువ చేసే 700 షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవీ పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వాటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాల్సి ఉంది. అలా చేయాలంటే ప్రభుత్వం కేసును సాధ్యమైనంత తొందరగా ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి సమావేశంలో చర్చిస్తున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. కూటమి ప్రభుత్వమైనా దీనికి ముగింపు పలకాలని రైతులు కోరుతున్నారు.

ముసురుకున్న సీజనల్ వ్యాధులు

జిల్లాలో సీజనల్ వ్యాధులు ముసురుకున్నాయి. పల్లె, పట్టణమనే తేడా లేకుండా అంతా విష జ్వరాలతో బాధపడుతున్నారు. విష జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా పీడితులూ ఎక్కువగానే ఉన్నారు. వీటితోపాటు డయేరియా బారిన పడుతున్న కేసులూ నమోదవుతున్నాయి. జిల్లాలో ఏ ఆసుపత్రి చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రితో పాటు టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రి, అన్ని పిహెచ్‌సిలు, ప్రయివేట్ క్లినిక్‌లూ జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే సరుబుజ్జిలి, పాతపట్నం, ఎచ్చెర్ల, టెక్కలి, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల్లో కేవలం జ్వరాలు, సీజనల్ వ్యాధులతో మృతి చెందిన ఘటనలూ చోటుచేసుకున్నాయి.

మత్స్యకారులకు అందని వేట నిషేధ పరిహారం

సముద్రంలో చేపల వేటపై ఉన్న నిషేధం ఎత్తేసి రెండున్నర నెలలు కావస్తోంది. మత్స్యకారులకు అందాల్సిన పరిహారం నేటికీ వారి ఖాతాల్లో జమ కాలేదు. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జూన్ 15వ తేదీన చేపల వేటపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. పరిహారం చెల్లింపుల కోసం ఈ ఏడాది జూన్ రెండో తేదీన జాబితాను రూపొందించి ప్రభుత్వానికి పంపారు. డబ్బుల కోసం వేలాది మంది మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు.

ఇసుక దొరక్క ఇక్కట్లు

జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. వర్షాకాలం కావడంతో ఇసుక లభ్యత తక్కువగా ఉంది. ఇసుక దొరక్క భవన నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూరు మండలం అంగూరు, గార మండలం శాలిహుండం, బూర్జ మండలం కాఖండ్యంలో ఇసుక స్టాక్ ప్లాయింట్లను ఏర్పాటు చేసి ఇసుకను సరఫరా చేస్తున్నారు. మరోవైపు అనధికారికంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుకను ఆక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు ఇస్తున్నా యథేచ్ఛగా రవాణా సాగుతూనే ఉంది.

అధ్వానంగా రహదారుల పరిస్థితి

జిల్లాలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి పనులను 2018లో రూ.40 కోట్లతో పనులు ప్రారంభించారు. 2021 నాటికే పూర్తి కావాల్సి ఉన్నా సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.15 కోట్ల వరకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. బకాయి బిల్లులపై మంత్రి అచ్చెన్నాయుడు హామీతో తిరిగి పనులు మొదలయ్యాయి. వీటితోపాటు బత్తిలి-అలికాం, కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం, చిలకపాలెం-రాజాం వంటి ప్రధాన రహదారులు బాగా శిథిలమయ్యాయి.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రెవెన్యూ సదస్సులకు సన్నద్ధం

- పకడ్బందీగా ఈ-పంట నమోదు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- 'మీకోసం' వినతుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

త్వరలో నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు, డ్వామా, ఓటర్ల జాబితా రూపకల్పన, కోర్టు కేసులు, ఈ-పంట, ఇసుక లభ్యత, గృహ నిర్మాణం, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి సిబ్బందితో మంగళవారం మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో సున్నితమైన భూ సమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నందున సంబంధిత రెవెన్యూ అధికారులు పక్కాగా కార్యాచరణ ప్రణాళికలకు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా అసైన్డ్ భూములపై మరోసారి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో త్వరలోనే గ్రామాల వారీ తేదీలు ఖరారు చేస్తామని, ప్రతిష్టాత్మక ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 'మీకోసం'లో వచ్చిన వినతుల్లో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పలు దశల్లో ఉన్నాయో ప్రతిరోజూ సమీక్షించాలన్నారు. రీ ఓపెన్ కేసులు ఒక్కటీ నమోదు కావద్దని స్పష్టం చేశారు.

పారిశుధ్యం విషయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అలసత్వం పనికి రాదన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి అందిన క్లయిమ్‌లను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులపై అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఈ-పంట నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే సమయం ఉందని, ఈలోగా పంట వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఈ-పంట నమోదు పూర్తి చేయడంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు వాటిని నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. ఈ-పంట నమోదులో 60 శాతం కంటే తక్కువ మండలాలు వారం రోజుల్లో పురోగతి సాధించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో పొరపాట్లకు తావులేని విధంగా క్షేత్రస్థాయిలో అన్నివిధాలుగా విచారించిన తర్వాతే జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. త్వరలో చేపట్టనున్న ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జెడ్‌పి సిఇఒ ఎం.వెంకటేశ్వరరావు, డిపిఒ ఆర్.వెంకట్రామన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్, గ్రామ, వార్డు సచివాలయల నోడల్ అధికారి వాసుదేవరావు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

రాత్రి గస్తీతో నేరాలు తగ్గుముఖం

- ప్రతి బీట్ పాయింట్ క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాత్రివేళల్లో గస్తీ (నైట్ బీట్) విధులు పటిష్టంగా అమలు చేసి నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. నేరాల నియంత్రణకు రాత్రి గస్తీ నిర్వహణ, అమలు, బీట్ పాయింట్స్, పాత నేరస్తులు, కొత్త వ్యక్తుల తనిఖీ తదితర అంశాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని సిఐ, ఎస్ఐలతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా గస్తీ విధుల అమలుతో జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అయినా మరింత అప్రమత్తంగా తిరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతిరోజూ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి గస్తీకి కేటాయించిన బీట్ సిబ్బందికి బీట్ తనిఖీ అధికారి అప్రమత్తతతో విధులు నిర్వహించే విధంగా బ్రీఫింగ్ ఇవ్వాలన్నారు. ఎక్కడైనా దొంగతనం జరిగితే ఆ నేరం విధానం, తీరు, ముద్దాయి ఆనవాళ్లు తెలిపి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. తరుచుగా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచి వారిని నిత్యం తనిఖీ చేయాలన్నారు. రైల్వే, బస్టాండ్లలో రాత్రివేళల్లో బస చేసే ప్రయాణికులు, అపరిచితుల వివరాలు సేకరించి ప్రయాణానికి గల కారణాలు ఆరా తీయాలని సూచించారు. ముఖ్య కూడళ్లలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేసి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. రాత్రివేళల్లో బ్యాంకులు, ఎటిఎం, వ్యాపార సముదాయాల వద్ద మరింత పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తిస్తూ నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఎస్‌పిని కలిసి డిఎస్‌పి, సిఐలు

సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద మంగళవారం బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్‌పి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. కళింగపట్నం మెరైన్ సిఐ బి.ప్రసాదరావు, నరసన్నపేట, సారవకోట, మందస, ఇచ్ఛాపురం రూరల్, బూర్జ ఎస్ఐలు సిహెచ్.దుర్గాప్రసాద్, బి.అనిల్ కుమార్, ఎస్.కె ఖాదర్‌బాషా, ఇ.శ్రీనివాస్, ఎం.ప్రవళ్లిక ఎస్‌పిని కలిసిన వారిలో ఉన్నారు.

వాగ్వివాదంతో రోడ్డు ఎక్కిన దంత గ్రామస్తులు

సామాజిక తనిఖీలో ఉద్రిక్తత

- దంత గ్రామస్తుల వాగ్వివాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

2023-24 ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి ఉమామల్లేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని దంత గ్రామానికి చెందిన అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారి అరుపులు, కేకలు, తోపులాటలతో ఈ పరిస్థితి తలెత్తింది. దంత గ్రామంలో తప్పుడు ధ్రువపత్రాలతో సామాజిక పింఛన్లు అందుకున్న వారు ఎక్కువగా ఉన్నారని 72 వికలాంగ పింఛన్లలో 60 తప్పుడు ధ్రువపత్రాలతో పొందినవేనని సామాజిక తనిఖీల నివేదికను డిఆర్‌పిలు చదివి వినిపించారు. గ్రామంలో మత్స్యకారులు లేకపోయినా, ఆ సామాజిక తరగతి పేరుతో ఎనిమిది పింఛన్లు వస్తున్నాయని తెలిపారు. సరియాపల్లిలో 20, కొత్తపల్లిలో 28, యలమంచిలిలో 38, శ్రీ జగన్నాథపురంలో 30 ఇలా అన్ని పంచాయతీల్లో తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నారని సామాజిక తనిఖీల్లో బయటపెట్టారు. పలు పంచాయతీల్లో ఒకే రేషన్‌కార్డుకు రెండు జాబుకార్డులు ఉన్నాయని చెప్పారు. ఎత్తురాళ్లపాడు పంచాయతీలో ధర్మకోనేరు చెరువు పనులు పేరిట బిల్లు చేసి గ్రంథాలయం, సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారని, సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ బహిరంగంగానే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడని ఆ గ్రామస్తులు ఫొటోలతో సహా డ్వామా పీడీకి అందజేశారు. ఎ.కొత్తపల్లి పంచాయతీలో కొంతమంది పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేశారని గ్రామస్తులు చెప్పారు. గత ఐదేళ్లలో ఉపాధి హామీలో పెద్దమొత్తంలో అవినీతి చోటుచేసుకుందని దంత గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆరోపించగా, వైసిపి నాయకులు వ్యతిరేకించారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. అరుపులు, కేకలు, తోపులాటలతో రోడ్డెక్కారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకున్నారు. దురుసుగా ప్రవర్తించిన వారిని అదుపులోకి తీసుకున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు హెచ్చరించారు. చెరువు పనులు, రహదారులు, మొక్కల పెంపకం, కాలువల నిర్మాణం తదితర పనుల నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడితే నిధులు రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి డి.వెంకటరావు, ఎపిడిలు కె.రాధ, టి.మురళీకృష్ణ, శైలజ, ఎస్‌ఆర్‌పి పున్నపునాయుడు, ఎం.తిరుపతిరావు, డిఆర్‌పిలు, ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ యాంత్రీకరణ మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయశాఖ సంయుక్తంగా రాగోలులో ఈనెల 29వ తేదీన వ్యవసాయ యాంత్రీకరణ మేళాను నిర్వహిస్తున్నట్లు పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ పి.వి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి 9.30 గంటల వరకు పేర్లు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. 9.30 గంటలకు క్షేత్ర సందర్శనతో కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన, వ్యవసాయ క్విజ్, రైతు సదస్సు, గౌరవ అతిథుల ప్రసంగాలు, వ్యవసాయ ప్రచురణల ఆవిష్కరణ ఉంటాయని తెలిపారు. భోజన విరామం అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన, రైతులతో శాస్త్రవేత్తల చర్చాగోష్ఠి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు

- కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఎ.సిరి
- రోగులను రిఫర్ చేయడంపై అసహనం

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వైద్యులు, వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదని, పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ అట్టాడ సిరి హెచ్చరించారు. స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై పలువురు రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎమెర్జెన్సీ క్యాజువాలిటీ, వార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయని, వీటిని అధిగమించాలన్నారు. జిల్లా కేంద్రాస్పత్రి అయినా రోగులను శ్రీకాకుళం, విశాఖకు రిఫర్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని కేసులనూ రిఫర్ చేయడం లేదని, అత్యవసర వైద్యం అందించాల్సిన సమయంలో మత్తు వైద్యులు లేకపోవడంతో రిఫర్ చేయాల్సి వస్తోందని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు తెలిపారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య తగ్గిందని, పెరిగేలా కృషి చేయాలని ఆమె సూచించారు. ఆస్పత్రిలో పారిశుధ్యం, రోగులకు బెడ్ షీట్లకు సంబంధించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లేదంటే రోగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశముందని, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి ప్రాంతీయ అధికారి రాజ్యలక్ష్మి, వైద్యులు ఉన్నారు.

వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న సిరి

బాధితుని వద్దకే ఎస్‌పి

వినతిని స్వీకరించి సమస్య పరిష్కారానికి ఆదేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌పి కోసం ఎదురుచూస్తున్న వికలాంగ వృద్ధుని వద్దకు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి స్వయంగా వెళ్లి వినతిని స్వీకరించారు. మంగళవారం ఉదయం ఎస్‌పి కార్యాలయానికి వస్తున్న సమయంలో కార్యాలయ ఆవరణలో కూర్చుని ఉన్న ఎల్ఎన్‌పేట మండలం కోవిలాంకు చెందిన వికలాంగ వృద్ధుడు పి.మాధవయ్యను గమనించారు. ఆయన వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తాను నాటుకోళ్లు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నానని, తమ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన కోళ్లను దొంగిలించారని చెప్పారు. దీనిపై సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వివరించారు. దీనిపై ఎస్‌పి స్పందించి సరుబుజ్జిలి ఎస్ఐతో ఫోన్‌లో మాట్లాడి కోళ్లుఅపహరించిన వ్యక్తితో బాధితునికి నష్టపరిహారాన్ని త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

ప్రజాశక్తి - గార

శ్రీకాకుళం నియోజకవర్గంలోని ప్రజలందరికీ వ్యక్తిగత గృహ కుళాయి కనెక్షన్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని బందరువానిపేటలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలను మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు అందించి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని చెప్పారు. స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఐదేళ్లవైసిపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. పల్లెల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వ పెద్దలు వైఫల్యం చెందారన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జలజీవన్ పథకంపై దృష్టి సారించి గ్రామాల్లో పనులు మొదలు పెట్టామన్నారు. కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చానని, అందులో భాగంగా బందరువాని పేట మత్స్యకార కుటుంబాలకు ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్టు తెలిపారు. గ్రామంలో ప్రజలకు అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు అధికారులతో చర్చించి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకొస్తానని హామీనిచ్చారు. మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు, టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయడానికి పురపాలక సంఘం పరిధిలోని హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఇళ్ల నిర్మాణల పురోగతిపై హౌసింగ్ ఎఇ డి.సన్యాసిరావు వార్డు సచివాలయాల ఎమినిటీస్ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల వారీగా సమీక్షించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. లక్ష్య సాధనకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM EXCISE COURT AT SRIKAKULAM
O.S.No. 404/2022

Between:
Namana Parvateeswara Rao and another ......Plaintiffs
And:
Mupidi Srinivasa Rao and 29 others ......Defendants

DEFENDANTS NO.2
Pasupureddy Laxmi @ Satyavathi, W/o.Pushpa Rao, aged about 50 years, household duties, R/o Jaipur, Orissa State, C/o.Mupudi Srinivasa Rao, S/o.Late Venkata Ramana, R/o.Door No.1-1, Subhadrapuram junction, H/o. Thallavalasa village, Laveru mandal, Srikakulam district.

DEFENDANTS NO.6
Yernagula Nagaratnamma, W/o.Late Nageswara Rao, aged about 60 years, household duties, R/o Kondampeta village, Rajam mandal, erstwhile Srikakulam district, now Vizianagaram district.

NOTICE
Please take notice that the above matter is posted on Dt.24/09/2024 for your appearance. You both are hereby directed to appear before the Hon'ble Court on **Dt.24/09/2024 at 10.30 A.M.** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

By Court Order
BORA TIRUMALA REDDY
Advocate for Plaintiff
Srikakulam

మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

బోధనకే పరిమితం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

పాఠశాలల ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి ప్రభుత్వానికి కోరారు. క్యాంపెయిన్‌లో భాగంగా ఉర్లాం, బాడం, సుందరరాపురం పాఠశాలల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రకాల యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలన్నారు. జిఒ నంబరు 53 ప్రకారం పోస్టులను పని సర్దుబాటు చేయాలన్నారు. మెథడాలజీ పేరుతో ఎస్‌జిటి ఉపాధ్యాయులను హైస్కూల్‌కు పంపించడం సరైన పద్ధతి కాదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిటీ వేయాలని, అంతవరకు మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. నాడు-నేడు రెండో ఫేజ్‌లోని పాఠశాలలకు పెండింగ్ ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఈయనతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.ధమయంతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సుధీర్‌కుమార్, కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి పలాస

సెప్టెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కాక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, కేసుల నుంచి ఉపశమనం పొందాలని పలాస ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్‌పై తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో అందరికీ తెలిసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పోలీసులు కక్షిదారులకు నోటీసులు పంపించి వారందరూ రాజీకి వచ్చేన ఎడలా వెంటనే కేసుల నుంచి శాశ్వతంగా ఉపశమనం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, సెక్రటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ ఘని, కోశాధికారి రవి, న్యాయవాదులు, ఎంపిడిఒ రమేష్ నాయుడు, పలాస, వజ్రపుకొత్తూరు తహశీల్దార్లు ఈశ్వరమ్మ, సత్యం, ఆర్ఐ నిరంజన్‌రావు, డిటి గిరిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

యుపిఎస్ ఆమోదయోగ్యం కాదు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సిపిఎస్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న నూతన పెన్షన్ విధానం సరైనది కాదని, దానివల్ల ద్యోగులకు న్యాయం జరగదని, పాత పెన్షన్ సరైన విధానమని సిపిఎస్ జిల్లా కన్వీనర్ గొండు నారాయణరావు అన్నారు. యుటిఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని జర్జంగి, తిలారు, చిన్నబమ్మిది, నిమ్మడ, హరిశ్చంద్రపురం, కోటబొమ్మాళి, లఖందిడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం 117 జిఒ పేరుతో పాఠశాలలను అస్తవ్యస్తం చేసిందన్నారు. వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఆగస్టు 30న అన్ని మండల కేంద్రాల్లో యుటిఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, మండల నాయకత్వం సంజీవరావు, ఆనందరావు, మన్మథరావు, నాయుడు మాస్టర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న నారాయణరావు

యుపిఎస్ దగా

టెక్కలి : కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకుండా యుపిఎస్ పేరుతో అంకెల గారడి చేసిందని, ఇదొక దగా అని యుటిఎఫ్ టెక్కలి మండలశాఖ ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ ఏదైనా ఉద్యోగులకు నష్టమేనని అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను మోసగించే బూటకపు ప్రయత్నాన్ని విరమించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 30న స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రకటనల విడుదల చేసిన వారిలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, మండల కమిటీ అధ్యక్షులు గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు ఉన్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తగా వివిధ డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ తన లక్ష్యాలను ముందే నిర్దేశించుకుని పోటీకి తగ్గట్టు చదువుకోవాలన్నారు. కష్టపడేతత్వం అలవర్చుకుంటే ఎంతటి క్లిష్టమైన అంశాలనైనా సులభంగా నేర్చుకోవచ్చన్నారు. అందువల్ల ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించేవరకు కృషి చేయాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్య ద్వారానే మార్పు వస్తుందన్నారు. సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవడం ద్వారా తార్కిక ఆలోచనలు ఆవిర్భవిస్తాయన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా, శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఆర్థిక, సామాజిక పరమైన అసమానతలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు. స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బి.ఎన్.చల్లమయ్య, అధ్యాపకులు సంపతిరావు శశిభూషణరావు, హరిత, సిహెచ్.రామ్మూర్తి, డి.రవీంద్ర, పి.నారాయణ, అరుణకుమారి, బి.సుధారాణి మాట్లాడుతూ కో కరిక్యులర్ యాక్టివిటీస్ కూడా విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి వి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

విద్యార్థినులు ధైర్యంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి- పలాస

పాఠశాలల్లో, ఇతర ప్రాంతాల్లో విద్యార్థినులను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వారిపై ధైర్యంగా ఎదుర్కోవాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు సూచించారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ ఓసదర్భంగా మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. విద్యార్థినులు ఎక్కడైనా, ఎప్పుడైనా వేధింపులకు గురైతే తక్షణమే వేధింపులకు గురి చేసిన వ్యక్తిపై తిరుగుబాటు చేయాలన్నారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తక్షణమే తెలియజేసి వారిపై చర్యలు తీసుకొనే విధంగా ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థులు భోజనాలకు ముందు, తరువాత చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రేణుకాదేవి, సంజీవరావు, డి.సింగూరు చైతన్య, హెచ్ఎం చిన్నంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో నగరాల సామాజిక తరగతికి చెందిన పేద విద్యార్థులకు అమర్ రాజా కంపెనీ జిల్లా ఇన్‌ఛార్జి బి.వి.రవిశంకర్ ఆర్థికసాయాన్ని అందించారు. తన తండ్రి బెవర ముకుందరావు, మామ కొరికాన అనంతర గోవిందరావుల జ్ఞాపకార్థం పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థుల చదువులకు ఏటా సాయాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాది ఉత్తమ విద్యార్థులను గుర్తించి జిల్లా నగరాల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన డిఇఒ తిరుమలచైతన్య, డిపిఆర్ఒ బాలమాన్ సింగ్ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజల్స్ కళాకారులు డాక్టర్ మంతెన వాసుదేవాచారి, వాకర్స్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, పి.జి.గుప్త, బి.దేవీప్రసాద్, జి.లక్ష్మి, జిల్లా నగరాల సామాజిక సంక్షేమ సంఘం నేతలు పండు రాజగోపాలరావు, నల్లాన గిరిధర్, చిట్టిబాబు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి రేణుక పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- పోలాకి

రాష్ట్రస్థాయిలో జరిగిన త్వైక్వాండో పోటీలకు ఎపి మోడల్ కళాశాల విద్యార్థిని కర్ర చందు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో ఆమెకు మంగళవారం అభినందిస్తూ... ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26న శ్రీకాకుళం టౌన్ హాల్‌లో తైక్వాండో జిల్లా స్థాయి పోటీలో చందు పాల్గొని జూనియర్స్ విభాగంలో 44 కేజీల్లో గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ఈ నెల 30, సెప్టెంబరున 2న తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో పిఇటి ఎం.నీలమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎచ్చెర్ల : మండలంలోని అరిణాం అక్కివలస వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టుసాలిపేటకు చెందిన లావేటి కృష్ణారావు (45) మృతి చెందారు. మృతుడు శ్యామ్‌పిస్టల్‌లో కార్మికునిగా పనిచేస్తున్నారు. పనులు ముగించుకుని తోటి కార్మికుడు సూర్యారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అరిణాం అక్కివలస వద్ద టిప్పర్ ఢీకొన్నడంతో కృష్ణారావు ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. సూర్యారావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రాధ, కుమారుడు చరణ్, కుమార్తె సాయిగౌరీ ఉన్నారు. పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కృష్ణారావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణారావు (ఫైల్)

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

మెళియాపుట్టి : మండలంలోని దీనబంధుపురం కూడలి వద్ద 14 మద్యం సీసాలతో జలకలింగపురానికి చెందిన గొర్లె దుర్యోధనను మంగళవారం అరెస్టు చేశామని ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. రూ.2,850 విలువైన మద్యం సీసాలను మెళియాపుట్టి నుంచి దీనబంధుపురానికి అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. దీనబంధుపురం వద్ద తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. తనిఖీలను ముమ్మరం చేస్తున్నామని తెలిపారు.

వైసిపి నాయకుడు మృతి

మందస : మండలంలోని భైరిసారంగపురానికి చెందిన వైసిపి నాయకులు రట్టి లింగయ్య సోమవారం మృతి చెందారు. ఈయన గ్రామీణ వికాస్ బ్యాంకులో ఉద్యోగం చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈయన సతీమణి సరస్వతి రెండుసార్లు సర్పంచ్‌గా పనిచేశారు. రెండు రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుడు...

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమానికి నాయకత్వం వహించి మూడు దశాబ్దాల పాటు సేవలందించిన శంభాన రామారావు మాదిగ మంగళవారం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. కంచిలి మండలానికి చెందిన ఆయన అనారోగ్యంతో ఆదివారం ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతిపై ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, జిల్లా అధ్యక్షులు రాణ శ్రీనివాస్‌లు తన ప్రగాఢ సంతాపాన్ని వెలుబుచ్చారు. ఉద్యమానికి ఆయన లేని లోటు పూడ్చలేనిదని కొనియాడారు.

'చొక్కాకుల బంద' సమస్యను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఆరో వార్డు పరిధిలోని కాళింగమన్నయ్యపేటలోని ఆక్రమణకు గురైన చొక్కాకుల బంద సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చొక్కాకుల బంద 5.62 సెంట్లు విస్తీర్ణంలో ఉండేదని, దానిని వార్డులోని కొంతమంది పెత్తందార్లు ఆక్రమించి బందను కప్పేశారని అన్నారు. దీంతో దాని కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండి నష్టపోతున్నామని వివరించారు. ఇటీవల శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు చొక్కాకుల బందను పరిశీలించి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి హద్దులను కూడా నిర్ణయించారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరిస్తే 80 ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో రైతులు కూన సుందరరావు, పాతిన రమణ, పైడి మోహనరావు ఉన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

సోంపేట : మాట్లాడుతున్న మాధవరావు

పాతపట్నం : స్థానిక మహేంద్ర డిగ్రీ కాలేజ్‌లో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ సలహా మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యాన 'మీకు తెలుసా'లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఆర్.జి.ఆచార్యులు, లెక్చలర్లు ఉమ, టి.సోమేశ్వరరావు, ఎస్.వంసతరావు, రవికుమార్, సిఎల్‌డబ్ల్యు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన 'మీకు తెలుసా'లో భాగంగా పురుషోత్తంపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీకన్య ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు., ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో వై.రవికుమార్, శాంతికుమారి, యర్రమ్మ పాల్గొన్నారు.

సోంపేట మండలంలోని బారువ డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థల సహకారంతో 'మీకు తెలుసా'లో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వ్యాధి సోకిన వ్యక్తులకు ఆధునిక చికిత్స పద్ధతులను వివరించారు. విద్యార్థులు ఎయిడ్స్ నివారణపై సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తెలియచేశారు. ప్రిన్సిపాల్ డి.రామారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఒలు రాజేంద్రప్రసాద్, స్నేహలత, ఐక్యూ ఎపి కో-ఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా కుమార్ నాయక్

పలాస : 'మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' జిల్లా శాఖ అధ్యక్షునిగా రంగస్థలం, సినీ నటుడు కుమార్ నాయక్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు జె.ఎన్.రాజేంద్ర ఆదేశాల మేరకు జిల్లా శాఖ 2024-25 వార్షిక సంవత్సరానికి మంగళవారం నూతన కార్యవర్గాన్ని స్థానిక చంద్రశేఖర ఆలయం ఆవరణలో మంగళవారం ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా డి.ఎ.స్టాలిన్, కోశాధికారిగా బమ్మిడి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా మడ్డు ఈశ్వరమ్మ, సంయుక్త కార్యదర్శులుగా తోట సింహాచలం, సారక మోహనరావు, సహాయ కార్యదర్శులుగా బమ్మిడి రుక్మాంగధరరావు, తంగి శోభారాణి, ఇసి మెంబర్లుగా ఏడుగురుని ఎన్నుకున్నారు.

నేత్రదానంపై అవగాహన

మందస: నేత్రదానాలకు ముందుకు రావాలని మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మద్దిల సంపత్‌రావు పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన నేత్రదానంపై అవగాహనపై మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ నేత్రదానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యక్తి మృతి చెందిన 6 గంటల లోపు నేత్రాలు దానం చేయాల్సి ఉంటుందన్నారు. వారు కంటిపై ఉన్న కార్నియా పొర మాత్రమే దాతలు నుంచి సేకరిస్తారన్నారు. నేత్రదానం మన అందరికీ ఆదర్శమని కొనియాడారు. వైద్య సిబ్బంది కృష్ణారావు, హేమలత, రుక్మిణి, నిర్మల, ప్రేమ్, కాంతారావు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో అన్నదానం

పోలాకి : మండలంలో బెలమర పంచాయతీ చిన్నకోడూరులో కృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా మంగళవారం అన్నదానం నిర్వహించారు. కరగాన రాము, కర్రి దుర్గారావు, కర్రి మల్లేసు ఆధ్వర్యాన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం

పలాస : విద్యార్థులు దిన చర్యలో భాగంగా రోజూ వ్యాయామం అలవర్చుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారన్నారని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య జీవన విధానంలో భాగంగా రోజుకు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్యంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించి ఆరోగ్య భారతదేశంలో పునాదులు వేయాలన్నారు. కార్యక్రమంలో పీడీ డాక్టర్ మధు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, ఉపాధ్యాయులు ప్రసాద్, గోవింద్, కోదండ, రాజేష్ పాల్గొన్నారు.

171 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కొత్తూరు : నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని ఆప్తాలమిక్ ఇప్పిలి జానకిరామయ్య అన్నారు. జాతీయ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని కడుమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నేత్రాలను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 171 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 21 మందికి కంటి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుమలరావు, పిఇటి చిన్నయ్య, మాలతి, సరల, సరోజని పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ముద్దు

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయం చేస్తే నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, నీరు, వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చునని రిసోర్స్ పర్సన్స్ పి.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెంగువాడలో కొత్తూరు వెలుగు ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్‌గా వెలుగు అసోసియేషన్ నుంచి ఎ.చిరంజీవిరావు, ఎ.నాగరాజు, పి.కళ్యాణి పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

కోటబొమ్మాళి : పశులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నామని జిల్లా పశు సంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ వి.జయరాజు తెలిపారు. రామయ్యపేట, చౌదరికొత్తూరు, మెండపేట, పొన్నానపేట, పాకివలస, కోటబొమ్మాళి గ్రామాల్లో 593 పశువులకు టీకాలు వేశారు.

అధ్వాన రోడ్డుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక కళాశాల వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు దుస్థితిపై స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లామని టిడిపి నాయకులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ మేరకు ఈ రోడ్డును టిడిపి నాయకులు మతాల గాంధీ, అగతమూడి మాధవరావు, చొడవరపు రాము, వెంకటరమణ, ముగితి కృష్ణ, కోటి, జె.అప్పలనాయుడు, ఎల్.రాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ కళాశాల రోడ్డు పక్కన ఉన్న కాలువను గత ఐదేళ్ల క్రితం మూతపడిందన్నారు. దీంతో వాడుకనీరు, వర్షపునీరు రోడ్డుపై చేరుతుందని తెలిపారు. నీరు నిల్వ ఉండడంతో రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. భారీగా గుంతలు ఏర్పడ్డాయని చెప్పారు. గుంతల్లో లారీలు దిగబడి రోజుల తరబడి అందులో ఉండిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.

రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

విఐ నెట్‌వర్క్ సామర్థ్యం పెంపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టెలికాం రంగంలో విఐ ఎపి నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంపు చేసినట్లు ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటరు ఆనంద ధాని మంగళవారం వెల్లడించారు. రాష్ట్రంలోని 1,000 పైచిలుకు సైట్లలో ఎల్‌టివి 2500 ఎంహెచ్ జెడ్ బ్యాండ్‌లో స్పెక్ట్రంను 10 ఎంహెచ్ జెడ్ నుంచి 20 ఎంహెచ్ జెడ్‌కి అప్‌గ్రేడ్ చేసినట్టు తెలిపారు. లేయర్‌లో నెట్‌వర్క్ సామర్థ్యాన్ని రెట్టింపునకు పెంచుకుందని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉమ్మడి జిల్లాల పరిధిలోని నగరాలకు, పట్టణాలకు ఈ సౌకర్యం మెరుగుపడుతుందని చెప్పారు. అప్‌గ్రేడ్‌తో విఐ గిగానెట్ నెట్‌వర్క్ ద్వారా మరింత వేగవంతమైన డేటా స్పీడ్‌ను అందుకునేందుకు వీలవుతుందని తెలిపారు.

9 నుంచి క్రీడా పోటీలు

టెక్కలి: సెప్టెంబరు 9 నుంచి 12 వరకు క్రీడా పోటీలను నిర్వహించాలని ఎంఇఒలు దల్లి తులసీరావు, డి.చిన్నారావులు అన్నారు. స్థానిక మండల రిసోర్స్‌లో వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల ప్రకారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభించాలన్నారు. కబాడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాట్మెంటన్ వంటి క్రీడలను నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ఒక్కో క్రీడా పోటీలకు మండలంలోని పలు పాఠశాలల మైదానాన్ని ఎంపిక చేశామన్నారు. సమావేశంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాడన నారాయణరావు, మండలస్థాయి అధికారి కె.కె.రామ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజా, జగదీష్, ఆదిశేషు పాల్గొన్నారు.

ఘనంగా అసిరితల్లి పండగ

పొందూరు: పొందూరులోని అసిరితల్లి అమ్మవారు పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ప్రజల దర్శనార్థం ఊరేగించారు. మహిళలు ముగ్రాటలతో స్వాగతం పలికారు. అలాగే పిల్లవలసలోనూ నిర్వహించారు. గ్రామస్తులు నిర్వహించిన సంస్కృతి, వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

విచారణ చేపడుతున్న లోకేష్

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొత్తవలస గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బొడ్డేపల్లి వెంకటరమణపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేష్ కూలీల సమక్షంలో మంగళవారం విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో లేని వారి పేరిట మస్టర్లు వేసి నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్తులు ఎపిడికి వివరించారు. ఇతర ప్రదేశాల్లో ఉండే వారి పేరుపైనా మస్తర్లు వేసి నిధులు గోల్‌మాల్ చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ కూలీలు కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టానని తెలిపారు. ఈ నివేదికను డ్వామా పీడీకి అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

రామ్మోహనరావుకు అవార్డు

పలాస : పలాస ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు డాక్టర్ గరుగుబెల్లి రామ్మోహనరావుకు ఎ.పి.జె.అబ్దుల్ కలాం నేషనల్ సేవా రత్న అవార్డును అందుకున్నారు. విశాఖ పబ్లిక్ హాల్ సోమవారం రాత్రి చేయూత సోషల్ సర్వీసు ఆర్గనైజర్ ఆధ్వర్యాన ముఖ్య అతిథి డాక్టర్ జి.దామోదరావు చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైస్ ప్రింగ్ నేషనల్ యూనివర్సిటీ యుఎస్ఎ ఇండియా, వైస్ ఛాన్సలర్ డాక్టర్ అమ్స్ జెమ్స్ సౌందర్, డైరెక్టర్ డాక్టర్ వై.ఎస్. చిన్నారావు, న్యూ మా సినీ డైరెక్టర్ గుప్త పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న రామ్మోహనరావు

జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం

ఆర్అండ్‌బి టెక్నికల్ అధికారి కె.వి.ఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా అభివృద్ధికి రూ.రెండు కోట్లు లోబడి ఉన్న పనులకు ఆమోదం ఇచ్చే ప్రక్రియలో ఉద్యోగరీత్యా నాతో పాటు సహకార అందించడం మిక్కిలి సంతృప్తినిచ్చిందని ఆర్అండ్‌బి సూపరింటెండెంట్ కార్యాలయం టెక్నికల్ అధికారి కె.వి.ఎల్ నరసింహరాజు తెలిపారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. 1962 ఆగస్టు 12న పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఎండగండిలో శివరామరాజు, సత్యవతి దంపతులకు రెండో సంతానంగా జన్మించారు.

నరసింహరాజు

విద్యాభ్యాసం

1967లో జన్మస్థలం ఎండగండిలోనే ప్రాథమిక ప్రారంభించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు అక్కడే జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. 1978 నుంచి 1980 వరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కెజిఎల్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేశారు. 1980 నుంచి 1982 వరకు అక్కడే సిద్ధార్థ ఐటిఐలో ఐటిఐ టెక్నికల్ విద్యలో ఉత్తీర్ణులయ్యారు.

ఉద్యోగ జీవితం

1990లో ఆర్అండ్‌బి విశాఖపట్నం సబ్ డివిజన్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1992 నుంచి 1997 వరకు నేషనల్ హైవే శ్రీకాకుళం డివిజన్‌లో సర్కిల్‌లో ట్రేసర్‌గా పనిచేశారు. 1997 నుంచి 2000 వరకు విజయనగరం ఎపిఎంఎస్ఐడిసి సర్కిల్‌లో ట్రేసర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2005 వరకు ఆర్‌డబ్ల్యుఎస్ విజయనగరం సర్కిల్ కార్యాలయంలో పనిచేశారు. 2005 నుంచి 2007 వరకు విశాఖపట్నం డివిజన్ మర్రిపాలెంలో పనిచేశారు. 2007 నుంచి 2012 వరకు జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా ఆర్అండ్‌బి విశాఖపట్నం సర్కిల్‌లో పనిచేశారు. ఏడాది పాటు టెక్కలిలో పనిచేసి, మరో ఏడాది విశాఖపట్నం సర్కిల్ కార్యాలయంలో పనిచేశారు. 2014 నుంచి 2019 వరకు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్‌గా విజయనగరం ఆర్‌డబ్ల్యుఎస్ సర్కిల్ కార్యాలయంలో పనిచేశారు. 2019 నుంచి 2024 ఆగస్టు వరకు శ్రీకాకుళం ఆర్అండ్‌బి ఎస్ఇ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ... ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

అవార్డులు

2024లో జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా అప్పటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డు అందుకోవడం ఆనందాన్ని పొందానన్నారు.

కుటుంబ నేపథ్యం

నరసింహారాజుకు భార్య సుబ్బలక్ష్మి ఉన్నారు. ఈమె గృహిణి, కుమార్తె విజయలక్ష్మి అల్లుడు విక్రమ్ బిటెక్ పూర్తి చేశారు. మనవరాలు వర్షిత ఉన్నారు.